
సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

బుధవారం । 19 । జూన్ । 2024



ఆలయాలకు పూర్వ వైభవం

జిల్లాలో శిథిలావస్థకు చేరిన పురాతన ఆలయాలు భక్తుల సహకారంతో పూర్వ వైభవం సంతరించుకుంటున్నాయి. 8లో



చీనీ టన్ను రూ.30 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.30 వేలు పలికాయి.

గరిష్టం/కనిష్టం
36.2°/22.8°

జిల్లాలో మంగళవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమైంది. ఉక్కపోత నెలకొంది. నైరుతి దిశగా గంటకు 8 - 12 కి.మీ వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

ఆరోగ్యాంధ్రప్రదేశ్ దిశగా అడుగులు

- రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ మంత్రి సత్యకుమార్



కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ మాధవరెడ్డిలతో చర్చిస్తున్న మంత్రి సత్యకుమార్

ధర్మవరం అర్బన్: రాష్ట్రాన్ని ఆరోగ్యాంధ్రప్రదేశ్ దిశగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ మంత్రి సత్యకుమార్ తెలిపారు. ధర్మవరం నియోజకవర్గంలో మంగళవారం మంత్రి పలు కార్యక్రమాలలో పాల్గొన్నారు. సాయంత్రం ధర్మవరం ఆర్అండ్‌బీ అతిథి గృహంలో కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ మాధవరెడ్డిలు మంత్రిని కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. అనంతరం మంత్రి సత్యకుమార్ విలేకరులతో మాట్లాడుతూ ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా రాష్ట్రాన్ని తీర్చిదిద్దేందుకు అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఎయిమ్స్ తరహాలో మెరుగైన వైద్య సేవలు అందజేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. అందుకు అవసరమైన మౌలిక వసతులను మెరుగుపర్చడంతోపాటు సిబ్బందిని కూడా సమకూరుస్తామన్నారు. కేంద్రంలోను, రాష్ట్రంలోను జవాబుదారీతనంతో పనిచేసే ప్రభుత్వాలు వచ్చాయని, ప్రజల మనోభావాలు, ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వాలు పనిచేస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ అభివృద్ధిలో అన్ని స్థాయిల అధికారులు, ఉద్యోగులతో పాటు అన్ని వర్గాల ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ధర్మవరం నియోజకవర్గంలో పలు సమస్యలు తన దృష్టికి వచ్చాయని వాటిని పరిష్కరించడానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. మంత్రి వెంట టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్, జనసేన ఇన్‌చార్జ్ మధుసూదన్‌రెడ్డి, బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

నేడు, రేపు కేంద్ర బృందం పర్యటన

అనంతపురం అగ్రికల్చర్: రబీలో నెలకొన్న కరువు పరిస్థితులను అధ్యయనం చేసేందుకు ఇంటర్ మినిస్టీరియల్ సెంట్రల్ టీం (ఐఎంసీటి) పేరుతో ఆరు మందితో కూడిన కేంద్ర బృందం మంగళవారం జిల్లాకు చేరుకుంది. బుధవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ స్థానిక రెవెన్యూభవన్‌లో రాష్ట్ర స్థాయి కరువు పరిస్థితులపై ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను బృంద సభ్యులు తిలకిస్తారు. ఆ తర్వాత రెండు బృందాలుగా విడిపోయి ఒక బృందం శ్రీ సత్యసాయి జిల్లా రొద్దం మండలంలో దెబ్బతిన్న పప్పుశనగ పంటను పరిశీలించి రైతులతో ముఖాముఖి మాట్లాడనున్నారు. రెండో బృందం కర్నూలు జిల్లాకు వెళ్లనుంది. మళ్లీ తిరిగి గురువారం 10.40 గంటలకు విడపనకల్లు మండలం మల్లాపురం, 12 గంటలకు వజ్రకరూరు మండలం గూళ్యాపాలెం చేరుకుని దెబ్బతిన్న పంట పొలాలు పరిశీలించి రైతులతో మాట్లాడతారు. అనంతరం 2.50 గంటలకు ఉరవకొండ మండలం నింబగల్లు, 3.40 గంటలకు కణేకల్లు మండలం సొల్లాపురం, 3.50 గంటలకు ఉరవకొండ మండలం పెద్దకొకుంట్ల గ్రామాల్లో పర్యటించనున్నట్లు వ్యవసాయశాఖ వర్గాలు తెలిపాయి. వ్యవసాయ, అనుబంధ శాఖలు, ఆర్అండ్‌బీ, ఆర్‌డబ్ల్యూఎస్, డ్వామా తదితర ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో జరిగిన నష్టాలు, అవసరమైన సాయం కోసం కేంద్ర బృందానికి సమగ్ర కరువు నివేదిక ఇవ్వనున్నారు.

జోరుగా వానలు



హిందూపురంలో జలమయమైన మేళాపురం రోడ్డు

పుట్టపర్తి అర్బన్: జిల్లాలో వానలు జోరుగా కురుస్తున్నాయి. సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు 16 మండలాల్లో వర్షం కురిసినట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. అత్యధికంగా ఎన్‌పీ కుంట మండలంలో 68.6, అమడగూరు మండలంలో 63.8 మి.మీ. వర్షపాతం నమోదైంది. ఇక నల్లచెరువులో 58, హిందూపురంలో 54.6, లేపాక్షిలో 36., చిలమత్తూరులో 32.6, కదిరిలో 26.8, ఓడీచెరువులో 24.4, తనకల్లులో 20.6, తాడిమర్రిలో 16.6, గాండ్లపెంటలో 11.2, పరిగిలో 6.2, మడకశిరలో 4.4, గోరంట్లలో 4.2, తలుపులలో 2.4, ముదిగుబ్బలో 1.2 మి.మీ. వర్షం కురిసింది. జిల్లాలోని 16 మండలాల్లో మొత్తం 432 మి.మీ వర్షపాతం నమోదైంది. మరో రెండు రోజులు వర్షాలు కురుస్తాయని అధికారులు తెలిపారు.

అమ్మా..నేను బడికి పోతా

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచే యోచనతో రాష్ట్ర ప్రభుత్వం 'నేను బడికి పోతా' అనే వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. వేసవి సెలవుల అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 13 నుంచి పాఠశాలలు పునః ప్రారంభమైన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా బడులన్నీ తెరుచుకున్నాయి. బడిఈడు పిల్లలను వచ్చే నెల 12 వరకూ నెల రోజుల పాటు 'నేను బడికి పోతా' కార్యక్రమం ద్వారా పాఠశాలలో చేర్పించే ప్రయత్నం చేస్తున్నారు.

- కొత్త కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం
- సర్కారు బడిలో అడ్మిషన్ల పెంపే లక్ష్యం
- జూలై 12 వరకు కొనసాగనున్న స్పెషల్ డ్రైవ్



కదిరి: బడి ఈడు (6–14 ఏళ్లలోపు) పిల్లలు బడిలో ఉండాలి. చాలామంది పిల్లలు బడిలో చేరకుండా బడిబయట సంచరిస్తున్నారు. వారి తల్లిదండ్రుల నిర్లక్ష్యరాస్యత, ఆర్థిక సమస్యలు, చుట్టూ ఉన్న పరిస్థితులు, కొందరు పిల్లలకు చదువుపై ఆసక్తి లేకపోవడం.. ఇలా పలు రకాల కారణాలతో వారు బడిలో చేరలేదని వివిధ రకాల సర్వేలు చెబుతున్నాయి. అందుకే 'నేను బడికి పోతా' అనే కార్యక్రమం ద్వారా అవగాహనా సదస్సులు, చైతన్య ర్యాలీలు నిర్వహించి తల్లిదండ్రులకు తమ పిల్లలను చదివించాలనే ఆసక్తి కలిగే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

మూడు స్థాయిల్లో కమిటీలు

'నేను బడికి పోతా' అనే ఈ కార్యక్రమం మూడు స్థాయిల్లో ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు అధికార యంత్రాంగం ఒక ప్రణాళిక సిద్ధం చేసింది. ప్రధానంగా జిల్లా, మండల, గ్రామ స్థాయిల్లో కమిటీలు ఏర్పడ్డాయి. జిల్లా స్థాయిలో డీఈఓ చైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తారు. జిల్లా స్థాయిలో మరో 13 మంది సభ్యులుగా ఉంటారు. మండల స్థాయిలో ఎంపీడీఓ చైర్‌పర్సన్‌గా, మండల విద్యాశాఖాధికారులు కన్వీనర్‌లుగా వ్యవహరిస్తారు. తహసీల్దార్, సీడీపీఓ, గిరిజన సంక్షేమ శాఖ అధికారులు సభ్యులుగా ఉంటారు. గ్రామ స్థాయిలో తల్లిదండ్రుల కమిటీ చైర్‌పర్సన్ ఆధ్వర్యంలో పాఠశాల హెచ్‌ఎం, పంచాయతీ కార్యదర్శి, సీఆర్‌పీ, సచివాలయ సంక్షేమాధికారి, అంగన్‌వాడీ సిబ్బంది సభ్యులుగా ఉంటారు. ఈ మూడు స్థాయిలో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయనున్నారు.

అమలు ఇలా...

'నేను బడికి పోతా' కార్యక్రమంలో భాగంగా ఈ నెల 13న సమన్వయ సమావేశాలు, మండలాల కేటాయింపులు చేశారు. 14న ప్రభుత్వ బడిలో పిల్లలకు అందుతున్న మెరుగైన మధ్యాహ్న భోజన పథకం, పుస్తకాలు, బట్టలు, బూట్లు, ఇతర సదుపాయాలపై తల్లిదండ్రులకు వివరించారు. 15 నుంచి ఈ కార్యక్రమం వచ్చే నెల 12 వరకూ కొనసాగింపులో భాగంగా మండల, గ్రామ స్థాయిల్లో అధికారులతో కూడిన ఆయా బృందాల సభ్యులు ర్యాలీలు, సభలు, అవగాహనా సదస్సులు నిర్వహించి 6–14 ఏళ్లలోపు బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి తిరిగి ప్రభుత్వ బడుల్లో చేర్పించనున్నారు.



బుక్కపట్నంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

బడి బయట 15 వేల మంది..

జిల్లాలో 1,159 ప్రాథమిక పాఠశాలలు, 230 ప్రాథమికోన్నత, 307 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటన్నింటిలో 1,46,155 మంది విద్యార్థులు 1 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్నారు. ఏటా 6–14 ఏళ్ల లోపు విద్యార్థులు వివిధ కారణాలతో వేసవి సెలవుల అనంతరం తిరిగి బడిలో చేరడం లేదని వివిధ సర్వేల ద్వారా తెలుస్తోంది. ప్రధానంగా 5వ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు 6వ తరగతిలో చేరకపోవడం, 7వ తరగతి పూర్తయ్యాక కొందరు విద్యార్థులు ఇంటికే పరిమితమై చదువుకు దూరమవుతున్నారు. ఇలాంటి విద్యార్థులు జిల్లా వ్యాప్తంగా 15 వేల మంది దాకా ఉంచవచ్చని అధికారులు అంచనా వేశారు. ఇలాంటి వారందరినీ తిరిగి బడిలో చేర్పించే లక్ష్యమే 'నేను బడికి పోతా' కార్యక్రమ ముఖ్య ఉద్దేశం.

జిల్లాలోని పాఠశాలల వివరాలు

ప్రాథమిక పాఠశాలలు	1,159
ప్రాథమికోన్నత పాఠశాలలు	230
ఉన్నత పాఠశాలలు	307
మొత్తం విద్యార్థులు	1,46,155

సక్సెస్ చేద్దాం



మధ్యలో బడి మానేసిన 6 నుంచి 14 ఏళ్లలోపు పిల్లలను తిరిగి పాఠశాలలో చేర్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'నేను బడికి పోతా' కార్యక్రమాన్ని ప్రజల సహకారంతో పాటు ఆయా ప్రభుత్వ శాఖల ఉద్యోగుల భాగస్వామ్యంతో సక్సెస్ చేద్దాం. ఇది చాలా మంచి కార్యక్రమం. దీనికి సంబంధించిన పూర్తి వివరాలు ఇప్పటికే సమగ్ర శిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు ఇచ్చిన ఉత్తర్వుల్లో స్పష్టంగా పేర్కొన్నారు.

– పి.వి.శ్రీనివాసరెడ్డి, టీచర్, కదిరి మండలం

అందరి బాధ్యత



'నేను బడికి పోతా' కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది. ఇందుకోసం జిల్లా, మండల, గ్రామ స్థాయిల్లో కమిటీలు వేశాం. ఆయా కమిటీల్లో ఉన్న వారంతా బాధ్యతగా తీసుకొని షెడ్యూల్ ప్రకారం కార్యక్రమం నిర్వహించాలి. వీరి ఆధ్వర్యంలో జూలై 12 వరకూ స్పెషల్ డ్రైవ్ కొనసాగుతుంది.

– మీనాక్షి, జిల్లా విద్యాశాఖాధికారి

'బుగ్గ' ఆలయానికి ప్రత్యేక గుర్తింపు

- పదో తరగతి పాఠ్య పుస్తకంపై గోపురం ముద్రణ
- మరో సారి పాఠ్యపుస్తకాలకెక్కిన తాడిపత్రి



అంతరాలయంలో పూజలందుకుంటున్న శివలింగం (ఫైల్)



పదో తరగతి పాఠ్యపుస్తకంపై బుగ్గ రామలింగేశ్వర ఆలయ గోపుర చిత్రం

తాడిపత్రి అర్బన్: తాడిపత్రిలోని బుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయానికి ప్రత్యేక గుర్తింపు లభించింది. పదో తరగతి చరిత్ర సబ్జెక్టుకు సంబంధించిన భారతదేశం, సమకాలీన ప్రపంచం-1 పాఠ్యపుస్తకం కవర్ పేజీపై ఆలయ గోపురాన్ని రాష్ట్ర ప్రభుత్వం ముద్రించడంపై తాడిపత్రివాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో కూడా 'తాడిపత్రి' ఇంటర్ పాఠ్యాంశాల్లో స్థానం సంపాదించుకుంది. ప్లాస్టిక్‌ను నిషేధించి దేశానికే ఆదర్శంగా నిలవడంతో 2008లో ఇంటర్ పాఠ్యపుస్తకాల్లో తాడిపత్రి మున్సిపాలిటీ గురించి ప్రచురించారు. ప్రస్తుతం పదో తరగతి చరిత్రకు సంబంధించిన పుస్తకంపై బుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయ గోపురం ముద్రించడంతో మరోసారి తాడిపత్రి వార్తల్లో నిలిచింది.

దక్షిణ కాశీగా ఖ్యాతి..

పెన్నా నది ఒడ్డున వెలసిన బుగ్గరామలింగేశ్వర స్వామి ఆలయం ఎన్నో ప్రత్యేకతలకు నెలవుగా భాసిల్లుతోంది. కాశీలో విశ్వనాథుడి ఆలయానికి గంగా నది ఉత్తర వాహినిగా ఉన్నట్లే, 'బుగ్గ' ఆలయానికి పెన్నానది ఉత్తర వాహినిగా ఉండడం గమనార్హం. అలాగే కాశీలో ఆలయం పక్కనే శ్మశాన వాటిక ఉన్న రీతిలోనూ ఇక్కడి ఆలయం పక్కన ఉంది. బుగ్గ రామలింగేశ్వరుడు దక్షిణాభిముఖంగా వెలసి ఉండడంతో ఆలయం దక్షిణ కాశీగా ఖ్యాతి గడించింది. త్రేతాయుగంలో యాగ పరిరక్షణలో భాగంగా తాటకిని సంహరించిన అనంతరం స్త్రీ హత్య దోష నివారణకు అప్పటికే స్వయంభుగా వెలసిన బుగ్గ రామలింగేశ్వరుడికి రామలక్ష్మణులతో కలిసి విశ్వామిత్రుడు విశేష పూజలు చేయించినట్లు ఇతిహాసం చెబుతోంది. లింగోద్భవ స్థానంలో బుగ్గ నుంచి నిరంతరం నీరు ఉబికి వస్తుండడం మరో విశేషం.

ఈవీఎంలపై చర్చ జరగాలి

- మాజీ మంత్రి ఉషశ్రీచరణ్



మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఉషశ్రీచరణ్


పెనుకొండ రూరల్: ఇటీవల వెలువడిన సార్వత్రిక ఎన్నికల ఫలితాలు అందరినీ నివ్వెరపరిచాయని, ఈవీఎంలపై ప్రజల్లో చర్చ జరగాలని మాజీ మంత్రి ఉషశ్రీచరణ్ అన్నారు. మంగళవారం పెనుకొండ మండలం మునిమడుగు పంచాయతీ అమ్మవారిపల్లిలో నిర్వహించిన గంగమ్మ జాతరలో ఆమె పాల్గొన్నారు. అనంతరం వైఎస్సార్‌సీపీ నాయకుడు ప్రసాద్‌రెడ్డి నివాసంలో మీడియాతో మాట్లాడారు. ఈవీఎంల ద్వారా ప్రజలకు, రాజకీయ పార్టీలకు ఎటువంటి న్యాయం జరిగిందో అందరికీ తెలియాలన్నారు. టెస్లా సంస్థ అధినేత ఎలన్ మస్క్ సైతం ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) ద్వారా ఈవీఎంలను ట్యాంపరింగ్ చేసే అవకాశం ఉందని తన అభిప్రాయం వెల్లడించారన్నారు. ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశంగా పరిగణించే భారత్‌లో ఈవీఎం పనితీరు కచ్చితత్వంపై అన్వేషించాలని కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారన్నారు. ఈవీఎంల ద్వారా ఎన్నికలు నిర్వహించడమంటే ప్రజాస్వామ్యాన్ని ప్రమాదంలో పడేయడమేనన్నారు. దేశ వ్యాప్తంగా ఈవీఎంలపై ప్రజల్లో చర్చ జరగాలని, ఈ వ్యవస్థ ద్వారా ఎంత మేలు చేకూరుతుందో తెలియాలని అన్నారు.

అచ్చెన్నాయుడు మాటలు బాధాకరం

టీడీపీ కార్యకర్తలు ప్రభుత్వ కార్యాలయాల్లోకి పసుపు బిళ్లతో వెళితే అధికారులు గౌరవంగా కుర్చీలో కూర్చోపెట్టి.. టీ తెప్పించి మరీ అడిగిన పని చేసి పెడతారని, ఒక వేళ ఎక్కడైనా అధికారులు పనిచేయకపోతే వారి కథ నేను చూస్తా' అంటూ మంత్రి అచ్చెన్నాయుడు చేసిన వ్యాఖ్యలు బాధాకరమని ఉషశ్రీచరణ్ అన్నారు. ప్రజలు కూటమికి పట్టం కట్టింది ప్రజలందరికీ సేవ చేయాలని కానీ, వివక్షతో పాలన సాగించడానికి కాదని పేర్కొన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించిన చరిత్ర, ఇచ్చిన హామీలను 99 శాతం పూర్తి చేసిన ఘనత ఒక్క వైఎస్సార్‌సీపీకే దక్కుతుందని గుర్తు చేశారు. రాజకీయాలు ఎన్నికల వరకు మాత్రమేనని, తర్వాత ప్రజలందరూ సమానమేనని గుర్తెరగాలని హితవు పలికారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, వాల్మీకి కార్పొరేషన్ మాజీ చైర్మన్ పొగాకు రామచంద్ర, రామ్మోహన్‌రెడ్డి, వైశాలి జయశంకర్‌రెడ్డి, సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు సూర్యప్రకాశ్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, గంపల రమణారెడ్డి, శివారెడ్డి, సి.నారాయణరెడ్డి, ఎస్.నారాయణరెడ్డి, ప్రసాద్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, మండల కన్వీనర్లు మూర్తి, తిమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

మిషన్ మిల్లెట్ హుళక్కేనా..?

- గత ఏడాది వరుణుడు అడ్డు
- ఈ సారి చిరుధాన్యాల సాగుపై స్పష్టత కరువు



చిరుధాన్యాల పంటలు

అనంతపురం అగ్రికల్చర్: కనుమరుగవుతున్న చిరుధాన్యపు పంటల సాగును విస్తరించాలనే సమున్నత ఆశయంతో 2023 సంవత్సరాన్ని 'ఇంటర్నేషనల్ మిల్లెట్ ఇయర్' (అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరం)గా ఐక్యరాజ్యసమితి ప్రకటించినా... వరుణుడి కటాక్షం లేక అమలుకు నోచుకోలేదు. పర్యావరణ పరిరక్షణ, ప్రజారోగ్యం, అన్నదాతల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని 'మిషన్ మిల్లెట్' పేరుతో గత ప్రభుత్వాలు కార్యాచరణ ప్రణాళికలు రూపొందించినా వర్షాభావంతో ఆగిపోయింది. ఇవే కాదు... వేరుశనగ, కంది, ఆముదం, పత్తి లాంటి ప్రధాన పంటల విస్తీర్ణం కూడా తగ్గిపోయాయి. ఇలా మిల్లెట్ ఇయర్‌లోనే వాటి ఉనికి నామమాత్రం కావడం గమనార్హం. ఈ సారి ముందస్తుగా తొలకర్లు పడ్డాయి. ఆ తర్వాత నైరుతి రుతుపవనాల ప్రభావంతో విస్తారంగా వర్షాలు కురిశాయి. దీంతో ఈ సారైనా చిరుధాన్యపు పంటలు అలాగే పప్పుధాన్యపు పంటల సాగు విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం, వ్యవసాయశాఖ ఎలాంటి కార్యాచరణ అమలు చేస్తాయనేది స్పష్టం కావడం లేదు.

1960–85 మధ్య చిరుధాన్యపు పంటల హవా...

అందుబాటులో ఉన్న గణాంకాలు పరిగణనలోకి తీసుకుంటే మన పూర్వీకులు పూర్తి స్థాయిలో సంప్రదాయ చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు పండించినట్లు చరిత్ర చెబుతోంది. 1960కు ముందు, ఆ తర్వాత 1985 వరకు కూడా జిల్లాలో చిరుధాన్యపు పంటల హవా నడిచింది. వేరుశనగ పంట అనేది నామమాత్రం. ఆరికలు, సామలు, ఊదలు, అండుకొర్రలు, జొన్నలు, రాగులు, కొర్రలు, సజ్జ తదితర పంటలు లక్షల ఎకరాల్లో సాగు చేసేవారు. 1961–62లో చిరుధాన్యపు పంటలు ఏకంగా 5.55 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో వేశారు. వేరుశనగ పంట కేవలం 1.94 లక్షల హెక్టార్లకు పరిమితమైంది. 1971–72లో చిరుధాన్యపు పంటల విస్తీర్ణం 4.01 లక్షల హెక్టార్లు కాగా వేరుశనగ 2.55 లక్షల హెక్టార్లలో వేశారు. 1981–82లో చిరుధాన్యపు పంటలు తగ్గుముఖం పట్టాయి. ఈ పంటలు 3 లక్షల హెక్టార్లు కాగా వేరుశనగ విస్తీర్ణం 3.74 లక్షల హెక్టార్లకు పెరిగింది. 1991–92 సంవత్సరంలో చిరుధాన్యపు పంటలు కేవలం 60 వేల హెక్టార్లకు పడిపోగా... వేరుశనగ ఒక్కసారిగా 7.35 లక్షల హెక్టార్లకు ఎగబాకింది. ఇక 2001–02లో చిరుధాన్యపు పంటలు 30 వేలకు పరిమితం కాగా వేరుశనగ 7.80 లక్షల హెక్టార్లకు చేరుకుంది. 2010–11 విషయానికి వస్తే చిరుధాన్యపు పంటలు నామమాత్రంగా 20 వేల హెక్టార్లకు పరిమితం కాగా వేరుశనగ 8.34 లక్షల హెక్టార్లలో సాగైంది. 2020–21లో అయితే 4.70 లక్షల హెక్టార్లలో వేరుశనగ, చిరుధాన్యాలు మరింత తగ్గిపోయి 12 వేల హెక్టార్లకు పరిమితం కావడం గమనార్హం. ఇలా చిరుధాన్యపు పంటల సాగు బాగా తగ్గిపోవడంతో రైతులకు వ్యవసాయం నష్టాలు తెచ్చిపెడుతోందని విశ్లేషిస్తున్నారు. అదే సందర్భంలో విచ్చలవిడి రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందుల వాడకం వల్ల ఆహారోత్పత్తులు విషతుల్యమై ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం చూపిస్తున్నట్లు చెబుతున్నారు. నేడు ఆహారపు అలవాట్లలో చిరుధాన్యపు ఉత్పత్తులకు స్థానం కల్పిస్తున్న నేపథ్యంలో ఈ పంటల సాగు విస్తీర్ణం పెంపు తప్పనిసరి అంటున్నారు. ఈ క్రమంలో గత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం మిల్లెట్‌బోర్డు, పల్స్ బోర్డులు ఏర్పాటు చేసి వీటి సాగుపై దృష్టి సారించింది. 2023లో అమలు చేయాల్సిన మిషన్ మిల్లెట్‌కు వరుణుడు అడ్డుతగలడంతో ఏం చేయలేని పరిస్థితి నెలకొంది. చంద్రబాబు ప్రభుత్వమైనా మిషన్ మిల్లెట్ అమలుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



ఈ ఫోటోలో కన్పిస్తున్న వృద్ధుడి పేరు పెద్దన్న. పెదవడుగూరు మండలం అప్పేచెర్ల గ్రామం. ఈ నెల 16న సాయంత్రం ప్రాణాపాయ స్థితిలో సర్వజనాస్పత్రి ఎమర్జెన్సీ వార్డుకు వచ్చారు. పెద్దన్నను 24 గంటలకుపైగా ఎమర్జెన్సీ వార్డులోనే వెంటిలేటర్‌పై ఉంచేశారు. వాస్తవంగా ఇటువంటి కేసులను రౌండ్ ద క్లాక్ వైద్యులు పర్యవేక్షణ ఉండే అక్యూట్‌మెడికల్ కేర్ యూనిట్‌కు తరలించాల్సి ఉన్నా తీసుకెళ్లలేదు.



ఈ ఫోటోలో కన్పిస్తున్న యువకుడి పేరు భాస్కర్. పెనకచెర్ల యర్రగుంట్ల గ్రామం. కామెర్ల సమస్యతో మూడు రోజుల క్రితం ఎమర్జెన్సీ వార్డుకు వచ్చాడు. వైద్యులు చూడడానికి గంటల కొద్దీ సమయం పట్టింది. ఊపిరాడని స్థితిలో ఉన్న తనను పోస్టు గ్రాడ్యుయేషన్ విద్యార్థులు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు సకాలంలో చూడకపోవడంతో భాస్కర్ ప్రత్యక్ష నరకం చూశాడు. పెద్దన్న, భాస్కర్‌లే కాదు.. నిత్యం ఎంతో మంది ఎమర్జెన్సీ వార్డులో గంటల తరబడి నిరీక్షిస్తూ అవస్థలు పడుతున్నారు.

ప్రత్యక్ష నరకం

- జీజీహెచ్‌లో అడ్మిషన్ కోసం పడిగాపులు
- వర్ణనాతీతంగా ప్రాణాపాయ రోగుల పరిస్థితి
- నలుగురు ఆర్ఎంఓలున్నా పర్యవేక్షణ కరువు
- కలెక్టర్ స్పందిస్తేనే పాలన గాడిలోకి..



అడ్మిషన్ చేసుకోకపోవడంతో వీల్ చైర్‌పైనే ఉన్న రోగి

అనంతపురం కార్పొరేషన్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో అడ్మిషన్ పొందడం గగనమవుతోంది. రోజుల తరబడి ఎమర్జెన్సీ వార్డులోనే రోగులుండే దయనీయమైన పరిస్థితులు నెలకొన్నాయి. ప్రాణాపాయ స్థితిలో వచ్చిన రోగులను పోస్టు గ్రాడ్యుయేషన్ విద్యార్థులు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు చూశాకే వార్డులకు తరలిస్తుండడంతో అప్పటివరకూ వారు ప్రత్యక్ష నరకం చూస్తున్నారు. ఎప్పటికప్పుడు వార్డుల్లో పర్యటించి రోగులకు మెరుగైన వైద్య సేవలందేలా చర్యలు తీసుకోవాల్సిన ఆస్పత్రి ఉన్నతాధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. సిబ్బంది తమ మాట వినడం లేదని పలువురు ఆర్ఎంఓలు సమాధానమిస్తున్నారు. దీన్ని బట్టే ఆస్పత్రిలో పాలన ఎంత అధ్వాన స్థితికి చేరిందో అర్థం చేసుకోవచ్చు.

హెచ్ఓడీల ఉదాసీనత..

సర్వజనాస్పత్రిలో పలు విభాగాల హెచ్ఓడీలు వింత పోకడలకు తెరలేపారు. ప్రాణాపాయ స్థితిలో ఎమర్జెన్సీ వార్డుకు వచ్చే రోగులను మొదట క్యాజువాలిటీ మెడికల్ ఆఫీసర్ పరిశీలించి, రోగి సమస్యకు సంబంధించిన పీజీ, అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు కాల్ చేస్తే వారు చూసి రక్త, ఎక్స్‌రే, అవసరమైతే సీటీ, ఎంఆర్ఐ తదితర పరీక్షలను అక్కడే ఉండగా చేశాక.. అవసరమైతే అప్పుడు అడ్మిట్ చేసుకుంటున్నారు. అప్పటివరకూ రోగులను అక్కడే మంచాల్లో ఉంచేస్తున్నారు. లేకపోతే వీల్‌చైర్లపై ఉంచుతున్నారు. ఈ క్రమంలో ప్రాణాపాయ స్థితిలోని రోగుల బాధ వర్ణనాతీతంగా ఉంటోంది. ఆస్పత్రికి వచ్చిన వెంటనే సంబంధిత వార్డుకు తరలించి, అక్కడ వైద్య పరీక్షలు చేయాల్సి ఉన్నా, అటువంటి పరిస్థితి కానరాకుండా పోయింది. వివిధ విభాగాధిపతుల నిర్లక్ష్యంతోనే వైద్యం అందడంలో జాప్యమవుతోంది.

కొరవడిన పర్యవేక్షణ..

సర్వజనాస్పత్రిలో రెసిడెన్షియల్ మెడికల్ ఆఫీసర్ల (ఆర్ఎంఓ) స్థాయి అధికారులు నలుగురు ఉన్నారు. వీరు తమ కార్యాలయంలోనే తిష్ట వేస్తున్నారు. ఎమర్జెన్సీ వార్డులోకి వెళ్లి అక్కడి పరిస్థితులను గమనించి రోగులను సకాలంలో వార్డులకు పంపాల్సి ఉన్నా, పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఎమర్జెన్సీ వార్డులో కనీస వసతులున్నాయో లేదో కూడా చూడడం లేదు. కొన్ని ఫ్యాన్లు తిరగకపోవడంతో రోగి సహాయకులు విసనకర్ర, టవాళ్లతో ఊపే దుస్థితి నెలకొంది. కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ అయినా స్పందించి జీజీహెచ్ పరిస్థితులను చక్కదిద్దాల్సి ఉంది.

చెప్పినా వినడం లేదు

రోగులను సకాలంలో అడ్మిట్ చేయాలని ప్రతి సమావేశంలోనూ చెబుతున్నాం. ఇదే విషయం గతంలోనే ప్రొఫెసర్లకు తెలియజేశాం. కొన్ని విభాగాల వైద్యులు మా ఆదేశాలు పట్టించుకోవడం లేదు. ఇకపై రోగులను సకాలంలో వార్డులకు తరలించేలా చూస్తాం.

– డాక్టర్ పద్మజ, ఆర్ఎంఓ

క్లుప్తంగా

పావగడలో చైన్‌స్నాచింగ్

పావగడ: మహిళ దృష్టిని ఏమార్చి ఆమె మెడలోని బంగారు గొలుసును అపహరించుకెళ్లిన ఘటన పావగడలో సంచలనం రేకెత్తించింది. పోలీసులు తెలిపిన మేరకు... పావగడలోని పెనుకొండ రోడ్డులో ఉన్న పీడబ్ల్యూడీ కార్యాలయం ఎదుట సుధ అనే వివాహిత కిరాణాకొట్టు నిర్వహిస్తోంది. మంగళవారం ఉదయం 7.15 గంటలకు ఓ యువకుడు దుకాణం ఎదుట తన ద్విచక్ర వాహనాన్ని ఆపి తనకు 5 కిలోల బెల్లం కావాలని అడిగాడు. బెల్లం కట్టించిన తర్వాత 2 కిలోల చక్కెర అడిగాడు. చక్కెర తూకం వేస్తున్న సమయంలో ఆమె మెడలోని రూ.50 వేల విలువైన బంగారు మాంగళ్యం చైన్‌ను లాక్కొని ద్విచక్ర వాహనంపై ఉడాయించాడు. ఆ సమయంలో ఆమె కేకలు వేసినా ఫలితం లేకపోయింది. అదే సమయంలో ఆమె భర్త అన్న కుమారుడు ధీరజ్ అక్కడకు చేరుకుని ద్విచక్ర వాహనంపై దుండగుడిని వెంబడించినా ఆచూకీ లభ్యం కాలేదు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు సీఐ సురేష్ తెలిపారు.

'నేను బడికి పోతా'పై సమీక్ష


మాట్లాడుతున్న డీఈఓ మీనాక్షి

ధర్మవరం రూరల్: 'నేను బడికి పోతా' కార్యక్రమంపై మంగళవారం స్థానిక ఎమ్మార్సీలో ధర్మవరం మండలంలోని ప్రధానోపాధ్యాయులతో ఎంఈఓలు సమీక్షించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా విద్యాశాఖ అధికారి మీనాక్షి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరు నుంచి 14సంవత్సరాల వయసున్న బాలబాలికలందరూ పాఠశాలలో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. మధ్యాహ్న భోజన ఏజెన్సీల విషయంలో ఎలాంటి సమస్యలు తలెత్తిన వెంటనే ఎంఈఓలకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు రాజేశ్వరి, గోపాల్‌నాయక్, ఎమ్మార్సీ సిబ్బంది, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

స్టూడెంట్ కిట్ల పంపిణీకి ఏర్పాట్లు

పుట్టపర్తి: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న పిల్లలకు స్టూడెంట్ కిట్లు పంపిణీ చేసేందుకు విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. గత ప్రభుత్వం 'జగనన్న విద్యా కానుక' పేరిట రెండు జతల యూనిఫాం, రెండు జతల షూలు, రెండు టైలతో పాటు పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలతో కూడిన కిట్ పంపిణీ చేసింది. జిల్లాలో 2,078 ప్రభుత్వ పాఠశాలల్లో 1,45,000పై చిలుకు విద్యార్థులు చదువుతున్నారు. వీరందరికీ ఈ సంవత్సరం నుంచి 'స్టూడెంట్ కిట్' పేరుతో కూటమి ప్రభుత్వం అందించేందుకు ఏర్పాట్లు చేసింది. బడి ప్రారంభించిన రోజు నుంచే పాఠ్యపుస్తకాల పంపిణీ ప్రారంభించింది. త్వరలోనే మిగతా విద్యా సామగ్రితో కూడిన కిట్లు అందిస్తామని అధికారులు తెలిపారు.

ఆలయాలకు పూర్వ వైభవం

- రాతి కట్టడాలకు ప్రాధాన్యమిస్తున్న భక్తులు
- నిర్మాణాలకు రూ.కోట్లు వెచ్చిస్తున్న వైనం
- పురాతన ఆలయాలకు నూతన సొబగులు


పుట్టపర్తిలో నిర్మాణంలో ఉన్న గంగమ్మ ఆలయం (ఫైల్)


నిడిమామిడిలో నిర్మిస్తున్న వీరభద్రస్వామి ఆలయం

పుట్టపర్తి అర్బన్: జిల్లాలోని చారిత్రక దేవాలయాలకు మహర్దశ చేకూరుతోంది. జిల్లావాసుల్లో ఆధ్యాత్మిక చింతన పెంపొందించే బాధ్యతను తమ భుజస్కంధాలపైకి ఎత్తుకున్న కొందరు... ఆ దిశగా పురాతన ఆలయాల జీర్ణోద్ధరణకు శ్రీకారం చుట్టారు. జిల్లాలోని చారిత్రక ఆలయాలు పూర్వ వైభవం సంతరించుకునేలాగా పూర్తి రాతి కట్టడానికి ప్రాధాన్యతనిచ్చారు.

రాతి కట్టడానికి పెరిగిన ఆదరణ

ఆలయాల పునురుద్ధరణలో భాగంగా రాతి కట్టడాలకు అత్యధిక ప్రాధాన్యతనిస్తున్నారు. ప్రజల్లో భక్తి భావం పెంపొందించేలా రాతితో అద్భుతమైన శిల్పాలు, స్తంభాలను చెక్కించి ఆలయాలకు పూర్వ వైభవం తీసుకువస్తున్నారు. ఇందు కోసం ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ఆళ్లగడ్డ నుంచి ప్రత్యేకంగా శిల్పులను రప్పించుకుని ఆధునిక సాంకేతికత సాయంతో ఆలయంలోని గోడలు, శిఖరాలు, పైకప్పులు, ముఖద్వారాలు, గోడలపై విగ్రహాలు, నిలువెత్తు స్తంభాలు, మంటపాలు, భారీ పరిమాణంలో గడపల నిర్మాణం చేపట్టారు.

భక్తుల భాగస్వామ్యంతో...

పూర్తిగా రాతి కట్టడంతో చేపట్టిన ఆలయాల నిర్మాణంలో భక్తుల భాగస్వామ్యం ఉండేలా విరాళాలు పోగు చేశారు. జిల్లా కేంద్రం పుట్టపర్తిలోని చిత్రావతి నది ఒడ్డున హారతి ఘాట్ సమీపంలో ఇటీవల గంగమ్మ దేవత ఆలయాన్ని అత్యంత సుందరంగా నిర్మించారు. దీని కోసం విదేశీ భక్తులు తమవంతు సాయంగా దాదాపు రూ.1.5 కోట్లను విరాళంగా అందజేశారు. 500 ఏళ్ల నాటి ఆలయాన్ని జీర్ణోద్ధరణ గావించి, ఇటీవల మూలవిరాట్‌కు ప్రాణప్రతిష్ట గావించారు. 16 ఏక శిలా స్తంభాలపై సుందరమైన శిల్పాలు ఆకట్టుకుంటున్నాయి. ఆలయ శిఖరం, ద్వారాలను సైతం శిలలతోనే నిర్మించిడం గమనార్హం.

- పుట్టపర్తి మండలం బత్తలపల్లి గ్రామంలో సత్యసాయి బాబా ప్రతిష్ఠించిన సీతారాముల ఆలయాన్ని ఇటీవల జీర్ణోద్ధరణ గావించారు. దాదాపు రూ.25 లక్షల వ్యయంతో ఈ ఆలయాన్ని నిర్మించారు. ఇటీవల ఈ ఆలయాన్ని భక్తి శ్రద్ధలతో ప్రారంభించారు. ఈ ఆలయ నిర్మాణంలోనూ వందలాది మంది భక్తుల సహకారం ఉంది.
- 15వ శతాబ్దంలో నిర్మితమైన పుట్టపర్తి మండలం నిడిమామిడి వీరభద్రస్వామి ఆలయానికి పెద్ద చరిత్రే ఉంది. అప్పట్లో అచ్చుతరాయలు ఈ ఆలయాన్ని నిర్మించినట్లుగా ఇక్కడి శాసనాల ద్వారా తెలుస్తోంది. పూర్తి శిథిలావస్థకు చేరుకున్న ఈ ఆలయాన్ని కర్ణాటకలోని గూళూరు వద్ద ఉన్న వీరశైవ మఠంతో పాటు భక్తుల సహకారంతో సుమారు రూ.1 కోటి వెచ్చించి నిర్మాణ పనులు చేపట్టారు. రెండెకరాల విస్తీర్ణంలో బెంగళూరుకు చెందిన శిల్పులు ఈ ఆలయాన్ని అందంగా తీర్చి దిద్దుతున్నారు.
- ఎస్‌ఎస్ గేటు సమీపంలోని శిర్డిసాయి ఆలయం, నల్లమాడ మండలంలోని గంగమ్మ ఆలయం, పుట్టపర్తి మండలం వెంకటగారిపల్లిలోని వేంకటేశ్వరస్వామి ఆలయం, కొత్తచెరువు మండలం చన్నరాజుపల్లిలో రామాలయం, గోరంట్ల మండలం కరావులపల్లిలో శివాలయం తదితర ఆలయాలను కేవలం రాతి కట్టడంతోనే నిర్మిస్తున్నారు. అంతేకాక ఆలయ పరిసరాలు పార్కులు, భక్తులకు అన్ని రకాల మౌలిక వసతులు సమకూరుస్తున్నారు. దీంతో ఆలయాలు సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకుంటున్నాయి.


బత్తలపల్లి వద్ద ప్రారంభించిన సీతారామాలయం


ఏకశిల స్తంభంపై చెక్కిన సింహం, ఏనుగు బొమ్మలు

ఇసుక దోపిడీకి రంగం సిద్ధం!

- ఉల్లికల్లు రీచ్ వద్దకు హిటాచీ చేరవేత
- అడ్డుకున్న గ్రామస్తులు
- లారీతో పాటు హిటాచీని వదిలి ఉడాయించిన డ్రైవర్


ఉల్లికల్లు గ్రామస్తులు అడ్డుకోవడంతో లారీలోనే ఉన్న హిటాచీ

శింగనమల: రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం ఏర్పాటైన కొద్ది రోజుల్లోనే సహజ వనరుల దోపిడీపై కొందరు దృష్టిసారించారు. ఈ క్రమంలో ఇసుక దోపిడీకి రంగం సిద్ధం చేశారు. అయితే సకాలంలో గ్రామస్తులు అప్రమత్తం కావడంతో హిటాచీని అక్కడే రోడ్డుపై వదిలేసి వెళ్లిపోయారు.

ఉల్లికల్లు రీచ్‌పై కన్ను

పెద్దపప్పూరు మండలం ఉల్లికల్లు రీచ్ నుంచి ఇసుక అక్రమ తరలింపులకు పథకం వేసినట్లుగా తెలుస్తోంది. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో అధికారాన్ని అడ్డు పెట్టుకుని టీడీపీ నాయకులే వెనుక నుంచి మొత్తం కథ నడుపుతున్నట్లుగా స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం ఉల్లికల్లు రీచ్ వద్దకు హిటాచీని చేర్చేందుకు వచ్చిన లారీని స్థానికులు గుర్తించి అడ్డుకున్నారు. హిటాచీని ఎక్కడకు తీసుకెళుతున్నారని అడిగితే పెన్నానదిలోకి అని డ్రైవర్ సమాధానం ఇవ్వడంతో ఇసుక దోపిడీకి రంగం సిద్ధమైనట్లుగా గ్రామస్తులు నిర్ధారించుకున్నారు. దీంతో డ్రైవర్‌పై వరుసగా ప్రశ్నల వర్షం కురిపించారు. లారీని ఎవరు పంపారు... హిటాచీ ఎవరికి సంబంధించింది... ఇసుక తరలించాలని ఎవరు ప్రయత్నిస్తున్నారని గ్రామస్తులు నిలదీయడంతో దిక్కుతోచని డ్రైవర్ లారీతో పాటు హిటాచీని అలాగే రోడ్డుపై వదిలేసి వెళ్లిపోయాడు. రెండు రోజులుగా లారీపై గ్రామస్తులు ప్రత్యేక నిఘా పెట్టారు. ఇసుక అక్రమ తరలింపులకు పథకం రచించినదెవరో తేలాల్సిందేనని భీష్మించారు.

'స్ఫూర్తిదాయకంగా ఎన్నికల విధులు'


కలెక్టర్‌ను సత్కరిస్తున్న అధికారులు

పుట్టపర్తి అర్బన్: సార్వత్రిక ఎన్నికల విధులను అధికారులు, సిబ్బంది స్ఫూర్తిదాయకంగా నిర్వర్తించి విజయవంతం చేశారని కలెక్టర్ అరుణ్‌బాబు ప్రశంసించారు. మంగళవారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అరుణ్‌బాబును అధికారులు, సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఎన్నికల విజయవంతంపై పలు విషయాలు చర్చించారు. ఇదే స్ఫూర్తితో అన్ని శాఖల అధికారులు కృషి చేసి జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్ఓ కొండయ్య, ఏఓ రామాంజనేయరెడ్డి, ఎన్నికల అధికారి మైనుద్దీన్, కలెక్టరేట్ సిబ్బంది, తహసీల్దార్లు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

అభ్యర్థులు ఎన్నికల ఖర్చుల వివరాలు సమర్పించాలి

సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసిన అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గాల అభ్యర్థులు ఎన్నికల్లో చేసిన ఖర్చుల వివరాలను వ్యయ పరిశీలకులకు సమర్పించాలని కలెక్టర్ అరుణ్‌బాబు సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల అభ్యర్థులు, ఏజెంట్లతో సమావేశం నిర్వహించారు. డీఆర్ఓ కొండయ్య, స్టాటిస్టిక్స్ మానిటరింగ్ అధికారి బాలాజీ తదితరులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియలో చివరి అడుగు ఉందని ,ఎన్నకల్లో పోటీ చేసిన అభ్యర్థుల వ్యయ ఖర్చుల వివరాలకు సంబంధించి తుది అకౌంట్స్‌ను వ్యయ పరిశీలకులకు సమర్పించాలన్నారు. ఈ నెల చివరి వారంలో వ్యయ పరిశీలకులు ముగ్గురు వస్తారని, వారం రోజులు ఇక్కడే ఉంటారని, అకౌంట్స్ పరిశీలన పూర్తి చేసుకోవాలని కోరారు. అన్ని పార్టీల నుండి రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

'పురం'లో భారీ వర్షం


మేళాపురం మసీదు ప్రాంతంలో జలమయమైన రహదారి


చెరువును తలపిస్తున్న రహదారి

హిందూపురంలో మంగళవారం మధ్యాహ్నం ఎడతెరపి లేకుండా వర్షం కురిసింది. 3.30 నుంచి రెండు గంటల పాటు కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. శ్రీకంఠపురం, మేళాపురం, హస్నాబాద్, కొట్నూరు ప్రాంతాల్లో కాలువలు పొంగి పొర్లాయి. మేళాపురంలో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. రెండు గంటల వ్యవధిలో 4 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

– హిందూపురం:

ఆటిజం పిల్లల వైద్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

- అనంత జేసీ కేతన్‌గార్గ్


కిట్లు అందజేస్తున్న అనంతపురం జిల్లా జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్

అనంతపురం ఎడ్యుకేషన్: మానసిక పరిపక్వత లోపం (ఆటిజం)తో బాధపడుతున్న పిల్లల వైద్య చికిత్సలపై ప్రత్యేక దృష్టి సారించాలని వైద్యాధికారులకు జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ సూచించారు. వైద్యశాఖ ఆధ్వర్యంలో మంగళవారం 'ఆటిష్టిక్ ప్రైడ్ డే' కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ మాట్లాడుతూ... మానసిక పరిపక్వత లోపం కలిగిన పిల్లల కోసం 'జిల్లా త్వరిత చికిత్సా కేంద్రం' ఏర్పాటు చేశారన్నారు. పుట్టుకతో లోపం ఉన్న పిల్లలందరికీ చికిత్సలు అందిస్తూ ఎంతో మంది పిల్లలను సాధారణ స్థితికి తీసుకురావడం అభినందనీయమన్నారు. ఈ వైద్య సేవలు జిల్లాలోని మారుమూల గ్రామాలకు సైతం తెలియాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యరావు మాట్లాడుతూ... ఆటిజంతో బాధపడుతున్న పిల్లలకు తల్లిదండ్రులు ఎక్కువ సమయం కేటాయించాలన్నారు. పిల్లలకు ఇష్టమైన క్రీడలు, విద్యను గుర్తించి ప్రోత్సహించాలన్నారు. తద్వారా పిల్లల్లో మానసికంగా, శారీరకంగా ఎదుగుదల ఉంటుందన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ భ్రమరాంబదేవి మాట్లాడుతూ... పుట్టుకతో లోపంతో వచ్చే అనేక మంది పిల్లలకు సరైన చికిత్సలు, థెరపీ, శస్త్ర చికిత్సల ద్వారా నయం చేస్తున్నామన్నారు. సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ... ఇప్పటి వరకూ 548 మంది పిల్లలు ఆటిజం నుంచి బిహేవియర్ మోడిఫికేషన్ థెరపీ ద్వారా రికవరీ అయ్యారన్నారు. మిగతా పిల్లలు ఫాలో అప్ ట్రీట్మెంట్‌లో ఉన్నారన్నారు. ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ జి. నారాయణస్వామి మాట్లాడుతూ... పుట్టుకతో వచ్చే లోపాల గల పిల్లలను వెంటనే డీఈఐసీ సెంటర్‌కు తీసుకొచ్చి రికవరీ అయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఎంఓలు డాక్టర్ పద్మజ, హేమలత, సునీత, ఆచార్యులు డాక్టర్ రవికుమార్, డాక్టర్ వైద్యనాథ్, డాక్టర్ రామస్వామి నాయక్, డీఈఐసీ జిల్లా మేనేజర్ రజిత, పీడియాట్రీషియన్ శ్రీవిద్య, క్లినికల్ సైకాలజిస్ట్ సుందరరావు, స్పీచ్ థెరపిస్ట్ గీత, ఆప్టోమెట్రీస్ట్ జ్ఞాన ప్రసన్న, స్పెషల్ ఎడ్యుకేటర్ చంద్రకళ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేసీ చేతుల మీదుగా పిల్లల తల్లిదండ్రులకు కిట్లు అందజేశారు.

కాలువ ఇలా.. నీరు పారేదెలా?

- పూర్తిగా కూలిన పీఏబీఆర్ లింక్ కెనాల్ రెగ్యులేటర్
- మరమ్మతులు చేపట్టి సజావుగా నీరు పారేలా చర్యలు తీసుకోవాలంటున్న రైతులు


ధ్వంసమైన పీఏబీఆర్ లింక్ కెనాల్ షట్టర్లు, సిమెంట్ దిమ్మెలు

ఉరవకొండ: ఉమ్మడి జిల్లాకు తాగు, సాగునీటి వరప్రసాదినిగా ఉన్న పీఏబీఆర్ పీఏబీఆర్ లింక్ కెనాల్ హెడ్ రెగ్యులేటర్ పూర్తిగా కూలిపోయింది. షట్టర్లు ధ్వంసమై, లైనింగ్ సైతం పెచ్చులూడి కాలువలో నీరు పారేందుకు వీలు లేకుండా అడ్డుపడ్డాయి. ఉరవకొండ మండలం మోపిడి వద్ద ఈ దుస్థితి నెలకొంది. ఈ హెడ్ రెగ్యులేటర్ వద్ద నుంచే కర్ణాటకలోని తుంగభద్ర డ్యాం నుంచి జిల్లాలోని పీఏబీఆర్, మిడ్‌పెన్నార్ డ్యాంలకు నీటిని మళ్లిస్తుంటారు. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లాలోని అన్ని ప్రాంతాలకు నీరు అందాలంటే లింక్ కెనాల్ ఎంతో ముఖ్యంగా మారింది. మోపిడి నుండి పీఏబీఆర్ వరకూ 11 కిలోమీటర్ల పొడువునా కాలువ నిర్మాణం జరిగింది. లింక్ కెనాల్ సాధారణ నీటి సామర్థ్యం 1,600 క్యూసెక్కులు ఉంటుందని పీఏబీఆర్ అధికారులు చెబుతున్నారు. లింక్ కెనాల్ ద్వారా అనంతపురం నగరంతో పాటు ఉమ్మడి జిల్లాలోని 1,800 గ్రామాలకు తాగునీరు అందుతుంది. దీంతో పాటు పీఏబీఆర్ కుడి కాలువ ద్వారా 42 చెరువులకు సాగునీరు అందించాల్సి ఉంది. ఇటీవల భారీ వర్షాల కారణంగా పీఏబీఆర్ లింక్ కెనాల్ షట్టర్లు, సైడ్ వాల్ పూర్తిగా ధ్వంసమై నీరు సజావుగా పారేందుకు వీలు లేకుండా శిథిలాలు అడ్డుపడ్డాయి. ఈ పరిస్థితుల్లో కనీసం 500 క్యూసెక్కుల నీటిని అందివ్వడం కష్టమేనన్న వాదనలు వినవస్తున్నాయి. దీనిపై అధికారులు స్పందించి తక్షణమే నిర్మాణ పనులు చేపట్టాలని పలువురు రైతులు కోరుతున్నారు. దీనిపై పీఏబీఆర్ డీఈఈ విశ్వనాథ్ మాట్లాడుతూ.. పీఎబీఆర్ లింక్ కెనాల్ మరమ్మతులకు అనుమతులు కోరుతూ ప్రభుత్వానికి నివేదికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న షట్టర్లు, సిమెంట్ దిమ్మెలు తొలగించి తాత్కలికంగా నీటి ప్రవాహానికి అడ్డంకులు లేకుండా చేస్తామన్నారు. శాశ్వతంగా షట్టర్లు నిర్మించడానికి ప్రభుత్వం నుంచి అనుమతులు పొందాల్సి ఉందన్నారు.








ప్రకృతి రమణీయత

మానవ నాగరికతకు మొదటి మెట్టుగా చెప్పుకునే వ్యవసాయం.. ఒక రకంగా మనిషికి ప్రకృతి ప్రసాదించిన వరం. దుక్కి దున్ని, విత్తు నాటి, పంట పండించే వరకూ అన్ని విషయాల్లోనూ రైతుకు ప్రకృతి సహకరిస్తుంది. సమయాన్ని బట్టి ప్రకృతిలో చోటు చేసుకునే వాతావరణ మార్పులు రైతుకు, చేనుకు ఎంతో మేలు చేకూరుస్తాయి. వ్యవసాయంలో పంటను నాశనం చేసే చీడపీడలు, కీటకాలే కాదు, రైతుకు దన్నుగా నిలిచే పురుగులూ ఉంటాయి. ఇలాంటి వాటిలో మొదటగా చెప్పుకోవాల్సింది ఆరుద్ర పురుగులు. అలాంటి అరుదైన ఆరుద్ర పురుగులు పుట్టపర్తి పరిసరాల్లో కనువిందు చేస్తున్నాయి. పొలాల్లో కనిపిస్తున్న ఈ పురుగులను చూసి రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. – పుట్టపర్తి రూరల్: